# 10

# కాశ్మీరదేవత

"నా ఆజ్ఞ ఎంత అప్రతిహతంగా కాశ్మీరంలో అంతట చెల్లి బడి అయితేనేమి, నా ప్రజలందరు ఎన్నెన్ని విధాల సిరిసంప దలతో తులతూగుతూంటేనేమి, నేనెంతటి వైభవంతో విలసిల్లు తూంటేనేమి ఈ దుర్భర పరాభవం నన్నను క్షణము వెంటాడి వేధి స్తున్నప్పుడు ?"

కాశ్మీరాధీశ్వరుడు దామోదర మహారాజు తెల్లవారుఝామున వందిమాగధులందరు తన ప్రాభవం వేనోళ్ళ గొంతులెత్తి ప్రశం సిస్తున్న సమయంలో దుస్సహ మానసికవ్యథతో ఉసూరుమని నిశ్వ సించాడు.

మరికొంతసేపటికి అతని దృష్టి క్రమక్రమంగా వెలవెల బోతున్న శయ్యాగార దీపికలపై ప్రసరించింది. "ఎటువంటి మహా పరాక్రమశాలి ఏవిధంగా పగవారి పాలబడి రణరంగంలో పరమపదిం చారు!" అని తిరిగి ఒక సుదీర్ఘమైన నిట్టూర్పు విడిచిపెట్టాడు. ఐతే తన జనకులు గోవిందమహారాజు అవక్ర పరాక్రమంతో చిరకాలం పోరాడి వీరశయ్య అలంకరించినందుకు దామోదరునికి కొంత సంతృప్తి కలగకపోలేదు. కాని ఆ వృత్తాంతం యావత్తు తలుచు కున్నప్పు డతని కెంతయినా దుర్భర మనోవ్యథ కలిగింది.

యాదవుల ప్రబల ప్రత్యర్థి జరాసంధునికి, దామోదరుని జన కుడు గోనందునికి చిరకాలంనుండి ఎంతో సన్నిహితమైన మైత్రిఏర్ప డింది. అందువల్ల జరాసంధు డర్థించిన వెనువెంటనే గోనందుడు

తన సైన్యాలతో సన్నద్ధుడై ఆతనితో బాటు దండెత్తిపోయి యమునా నదీతీరంలో విడిసి మధురానగరం ముట్టడించాడు.

ఆవిధంగా జరాసంధుడు కాశ్మీరాధీశ్వరు డాదిగాగల మరికొందరు నృపాలకులతో కలిసి తమ రాజధాని ముట్టడించాడన్న వార్త చెవినిపడగానే యాదవు లిక సహించలేక తమసైన్యాలతో సంసిద్ధులై వారి నెదుర్కొన్నారు.

ఆ భీకర సంగ్రామంలో యాదవుల కెటువైపు పోయినా అడుగడుగునా ఘోర పరాజయమే ఎదురయింది. జయజయధ్వానాలతో నేల ఈనినట్టుగా చెలరేగి జరాసంధుని సైన్యాలతో కలిసి గోనందుని వాహిను లువ్వెత్తుగా ఉప్పొంగి ముమ్ముందుకు లంఘించాయి.

ఆ సంగరంలో శ్రీకృష్ణదేవుడు కన్నులు మూసుకుని జరాసంధుని సేనలలో జొరబడి లోలోపలికి చొచ్చుకొనిపోయి ఆసైన్యాల ఉద్ధతి రవంత నిగ్రహించాడు.

అది గమనించి తిరిగి ధైర్యం తెచ్చుకొని బలరాముడు తన పెనునాగలి పైకెత్తి గోనందుని సేనలలో ప్రవేశించి భీషణ హుంకారంతో ఆ భూపతినెదుర్కొన్నాడు. మరికొంతసేపటి వరకు ఆ వీరాగ్రేసరుల నిరంతర సంగరం పరమభయంకరమై కొనసాగింది. ఇరుపక్షాల యోధులు మరి తమ పోరాటాలమాటే మరచి రెప్పపాటులైనా లేక వారిపైపే తిలకించారు. ఒకమారు బలరామునికే పరాజయం తప్పదన్నట్టు స్ఫురించింది. ఇంకొకమారు గోనందుని కిక ఘోరమృతి తప్పదన్న దృఢనిశ్చయం కలిగింది. ఆ సమయంలో యిరువైపుల మాటిమాటికి సింహనాదా లినుమడించాయి. ఆకాశంలో నలువైపులా అరుణారుణ ధూళి అలముకున్నది. మరి కొంతసేపటికి మేఘ నిర్ఘోషంవలె బలరామదేవుని సింహగర్జనం భూనభోంతరాళంలో భోరుమని మారుమ్రోగింది. క్షణకాలంపాటు ఉభయపక్షాల సైనికులకు ఏమి జరిగిందో తెలియలేదు! కాని అనతికాలంలోనే గోనంద భూపతి బలరాముని పెనునాగలి కెరఅయి భూతలిమీది కొరిగి ప్రాణాలుజ్జగించాడు. అల్లంతదూరంలో వాసుదేవునితో ప్రచండ యుద్ధం

కొనసాగిస్తున్న జరాసంధు దా వర్తమానం విని నిలువునా నిర్ఘాంత పడి, అధైర్యపడి మరి పోరాడలేక వెనుదిరిగి పారిపోయి. బలాల నన్నింటినీ ఉపసంహరించి మగధరాజధాని గిరివ్రజపురికి మరలి పోయాడు. యాదవు లొక్కుమారుగా గభీరజయజయ ధ్వానాలతో గగనాంతరాళం పూరించారు.

మరి కొన్ని దివసాలలోనే కాశ్మీరరాజ్యంలో అభిషిక్తుడయిన దామోదరుని కా ఘోర పరాభవం తలుచుకున్నప్పు డిక ఊపిరే ఆడ లేదు. ఏదోవిధంగా తిరిగి యాదవాధీశ్వరుల నెదుర్కొని లోలోపల రాజుకుంటున్న అక్కసుప్ప తీర్చుకోవలెనని నిశ్చయించుకున్నాడు. దానికోసం ప్రతిదినము అతి రహస్యంగా మిక్కిలి మెళకువతో యుద్ధ సన్నాహా లాచరించాడు. అయితే తగిన అదను చూసుకుని తగినంత కారణంతోనే ప్రత్యర్థులపై హఠాత్తుగా విరుచుకుపడి నిశ్శే షంగా నిర్మూలించవలెనని నిశ్చయించుకున్నాడు.

ఆనాడతడు యథాప్రకారంగా కొలువుకూటంలో అడుగుపెట్టే సరికి మంత్రులతోబాటు సదస్యులందరు సగౌరవంగా లేచి నిలిచి అవనతశిరస్కులై నమస్కరించి కనుసన్నల అనుమతితో తిరిగి తమ తమ సింహాసనాలపై సమాసీనులయినారు.

ప్రధానామాత్యు డటుపిమ్మట నెమ్మదిగా లేచి నిలిచి సవినయంగా తన ఏలిక సన్నిధికిపోయి ఒక అత్యంత రహస్యవార్త నివేదించాడు. దానితో దామోదరుని కన్నులెర్రబడ్డాయి. ముఖం రక్త కమలంలా జేవురించింది. ఆ పరమరహస్య మిది.

కాశ్మీరాని కిరుగుపొరుగు దేశమైన గాంధారాని కధిపతి తన తనూజ స్వయంప్రభ స్వయంవరోత్సవం చూతల ముఖతః దేశదేశా లలో ఉద్ఘోషింపజేయించాడు. కాని కాశ్మీరాధిపతి దామోదరునికి మాత్రం ఆ శుభాహ్వానం చేరలేదు!

దాని కేమి కారణమో అతని కవగాహనకాలేదు. అప్పటికింకా అతనికి పట్టుమని ముప్పయి సంవత్సరాల ప్రాయమైనా నిండలేదు. పట్టమహిషి యశోవతీదేవి ఉన్నా ప్రాయంలోఉన్న రాజన్యులు ఎంత

మంది తరుణీమణులనయినా పరిణయమాడవచ్చును: అది మహారాజ మర్యాద.

అదీగాక ఇంతకుమునుపు గాంధారాధీశ్వరులు అనూచానంగా కాశ్మీరంతో మైత్రి నెరపుతూ వైవాహిక సంబంధాలతో అది దృఢ పరుచుకున్నారు. మరి ఇప్పుడకస్మాత్తుగా గాంధారరాజు తనని ఆహ్వానించకుండా ఈ విధంగా అవమానించడానికి కేమిటి కారణం? దామోదరుని ముఖం కుంకుమరాశిలా ఎర్రబడింది.

"దీనికి యాదవాధీశ్వరుల నాహ్వానించడం జరిగిందా?"

దామోదరుడు ప్రధానామాత్యునివైపు చూచి తీవ్రంగా ప్రశ్నించాడు.

అమాత్యుడు క్షణకాలం ప్రతిసమాధానం చెప్పలేదు.

"అపూర్వ గౌరవంతో ఆహ్వానించినట్టే చారులెరిగిస్తున్నారు మహాప్రభూ!"

"అయితే గాంధారపతి మన ప్రత్యర్థులతో చేతులు కలిపివేస్తున్నట్టేనా?"

"మనల నవమానించి వారి నత్యంత గౌరవంతో ఆహ్వానించినప్పుడిక అంతకంటె వేరే ఉద్దేశ్య మేమి గోచరించడం లేదు."

"అయితే తక్షణమే మొక్కయి ఉన్నప్పుడే ఈ విషవృక్షాన్ని ఉన్మూలించివెయ్యడం మంచిది."

"నేను అదే ఆలోచిస్తున్నాను. అయితే మనకిది తగిన తరుణం కాదేమోనని సంకోచిస్తున్నాను.

కాని దామోదరభూపతి ఆ సదుపదేశం పాటించలేదు. వెను వెంటనే సైన్యాలతో దండెత్తిపోయి స్వయంవరం కోసమై సమీప దేశానికి వచ్చిన యాదవులపై ఒక్కుమ్మడిగా విరుచుకుపడి నిశ్శేషంగా సంహరించి వెయ్యవలసిందే అని హుంకరించాడు. ఆ సైన

కొందరు మంత్రు లదే మంచి పద్ధతి అని సమర్థించారు. ఆ ధోరణి గమనించిన ప్రధానామాత్యుని కిక తన ఏలిక పద్ధతికి పక్కతాళం వెయ్యక తప్పలేదు.

* * *

స్వయంవర మాలిక చేపట్టి స్వయంప్రభ ఇరువైపుల సింహాసనాలపై విజయంచేసిన వీరక్షత్రియ కుమారులవైపు క్రీగంటిచూపుల తూపు లల్లనల్లన విసురుతూ సవిలాస మందగమనంతో ముమ్ముందుకు సాగిపోయింది. కేవలం అలంకారంగా ముంగురులపై వేలాడుతున్న ఆమె మేలిముసుగులోనుండి మేలిమి బంగారువంటి ఆ రాకుమారి శరీరచ్ఛాయ శిశిర ప్రాతఃకాల కాంతిలా నలువైపుల ప్రసరించింది. రవంత పచ్చదనం కలిసిన తెల్లనిచెక్కిళ్ళపై కర్ణాభరణాల కాంతి ప్రతిఫలించింది. ఆమె చేతనున్న ఇప్పపూలతో అల్లిబిల్లిగా అల్లిన మందారమాల అలవోకగా కదలాడింది. "ఈ రాజనందిని ఏ భాగ్యశాలిని వరించనున్నదో కదా!" అని రాకుమారు లొక్కొక్కరే భావించుకున్నారు. ఆమె ఒక్క అడుగు వేసినంతలోనే వెనకబడిన వారి ముఖాలలో రవంత వైవర్ణ్యం పొడకట్టింది. ముమ్ముందున్న రాజనందనుల వదనాలలో జాజ్జ్వల్యమానమైన ఆశారేఖ నర్తించింది. గాంధార రాజతనూజ నాలుగయిదు నిమేషాలపా టొక రాజకుమారుని ముందు రవంత తటపటాయిస్తూ నిలిచింది. పార్శ్వంలో అనుసరిస్తున్న దాది ఆమెవైపు చూచి అతని గుణగణా లభివర్ణించడం ప్రారంభించింది. అనతికాలంలోనే ఆమె అతనిని తప్పక వరించగలదేమో అని అందరు నిర్ణయించుకున్నారు.

అదేక్షణంలో స్వయంవర సభాస్థలి కనతిదూరంలో దిక్కులొక్కమారుగా పిక్కటిల్లినట్లు కర్ణకఠోరమైన సంగరభేరీ విరావం చెలరేగింది. మరికొన్ని క్షణాలలోనే కాశ్మీరదేశ సైన్యం యాదవుల స్కంధావారంపై విరుచుకుపడిన వృత్తాంతం సమావిష్టు లయిన రాజన్యకుమారుల కవగతమైంది. వారిలో కొందరు తమ కరవాలాలు దూసి యాదవ స్కంధావారంపై పదేపనిగా పరుగు లారంభించారు.

అది గమనించి మరికొందరు ప్రచండ సింహగర్జనలతో కాశ్మీరపక్షం వైపు లంఘించారు.

అంతలోనే యాదవాధీశ్వరుల నెదిరించిన దామోదరునితో శ్రీకృష్ణ బలరామాదుల సంకుల సమరం ప్రారంభమైంది. స్వయం వర సభాస్థలి యావత్తు నిర్మానుష్యమైంది. గాంధార రాజకుమార్తె చేతిలోని స్వయంవర మాలిక ఆలాగే వసివాడి వేలాడింది.

యాదవ కాశ్మీర వాహినుల మధ్య చెలరేగిన సంకులసమరం క్రమక్రమంగా తీవ్రాతితీవ్రమై రణరంగంలో రక్తప్రవాహం ఉద్భ వింపజేసింది. ఎటువైపు చూచినా పెంధూళితక్క వేరేమి గోచరించ లేదు. కాని దీనాక్రందనాలతోబాటు ఘోర సింహగర్జన అనుక్షణము ఇనుమడించాయి.

ఆ సంగ్రామరంగం మధ్యభాగంలో దామోదరుని పరాక్రమ ధాటి కాగలేక మాటిమాటికి వెనకడుగువేస్తున్న బలదేవునివైపుచూడ గానే శ్రీకృష్ణదేవుడు దురాగ్రహావేశంతో గొంతెత్తి హుంకరించాడు. ఆ దర్పోద్ధతి గమనించి దామోదరు డిక బలదేవునివైపే చూడక తిన్నగా పోయి, రారమ్మని ఎలుగెత్తి గర్జించి కంసారి నెదుర్కొ న్నాడు.

వారిరువురిమధ్య కొంతసేపు ఎడతెగని పోరాటం కొనసాగినా జయాపజయాల నిర్ణయ మేమాత్రము సాధ్యపడలేదు. చక్రి దామో దరుని అపూర్వ శౌర్యధాటి గమనించి "ఆహా, ఏమి ఈ మహాశౌర్య శాలి యుద్ధచాతుర్యము!" అని లోలోపల మాటిమాటికి మెచ్చు కున్నాడు. ఇంకొకమారు దామోదరుని కరవాల పరిభ్రమణచాతుర్యం పరికించి "సాధు! సాధు!" అని ఎలుగెత్తి అభినందించాడు. మరికొన్ని క్షణాలలోనే దామోదరుని వాడివాడి కత్తిపోటులతో శౌరి కవచం ఛిన్నాభిన్నమై పూచిన మంకెనవలె తరళించింది. చక్రి మరి ఆ పరాజయం భరించలేక ఆజ్యం గుమ్మరించిన అగ్నిహోత్రజ్వాల వలె ప్రజ్వలించి కన్నులు మూసుకుని ప్రత్యర్థిమీదికి లంఘించి చక్రా

యుధంతో కుత్తుకపై ప్రహరించాడు. దామోదరుడు తన డాలుతో ఆ ఘాతంనుండి ఒడుపుగా తప్పించుకోవలెనని శాయశక్తులా ప్రయత్నించాడు. కాని ఆ డాలు తుత్తునియలయి నేలపై కూలిపోయింది. వెనువెంటనే వేరొకచక్రాఘాతంతో దామోదరుని శిరస్సొక్కమారుగా ఖండితమై నేలపై కూలింది. అది గమనించి మరి పోరాడలేక కాశ్మీర యోధులు భయంకర హాహాకారాలతో వెనుదిరిగి పలాయనా లారంభించారు. యాదవులు జయజయధ్వానాలతో వారి ననుసరిస్తూ తమ కందిన వారినందరినీ తుత్తునియలుగా విదళించారు. మరి కొంతసేపటికి పరిపూర్ణవిజయం యాదవాధీశ్వరుల హస్తగతమైంది. గాంధార రాజకుమారి స్వయంవరం తిరిగి మరి కొంతకాలానికిగాని సంఘటిల్లబోదన్న వార్త ఆకర్ణించిన బలరామదేవుడు స్వకీయ సైన్యాధీశ్వరుల వైపు చూచి తిన్నగా కాశ్మీరదేశంవైపు సాగిపోవలసినదని మహోత్సాహంతో ఎలుగెత్తి గర్జించాడు.

*　　*　　*

ఆవిధంగా కాశ్మీర సైన్యాల ననుసరించిన యాదవసేన అనతి కాలంలోనే కాశ్మీరరాజ్యం యావత్తు ఆక్రమించుకుని శ్రీనగరి స్వాధీనం చేసుకున్నాయి.

అటుపిమ్మట ఒకనాడు కాశ్మీరాధీశ్వరుల కొలువుకూటంలో వాసుదేవుడు అన్న బలరామునితో, కాశ్మీర ప్రధానమంత్రితో కలిసి మంతనం కొనసాగిస్తున్న సమయంలో యాదవుల ప్రధాన సచివుడు అక్కడికి వచ్చి నెన్నుదుటిపై దోసిలికట్టి కట్టెదుట నిలిచి ఆనతి కోసం నిరీక్షిస్తూ నిలుచున్నాడు. శౌరి అన్నతో తన మంతనం ముగించి కనుబొమ్మలెత్తి జిజ్ఞాసార్థకంగా ఆతనిపై నవలోకించాడు. యాదవ ప్రధానసచివుడు విన్నవించాడు:

"యాదవాధీశ్వరా! దామోదర మహీపతికి అన్నదమ్ములెవ్వరు లేరు. ఆ భూజానికి సంతతిలేదని తామెరిగినదేకదా! అంతే కాదు. కాశ్మీరరాజ్య పరిరక్షణ కర్హులైన దాయాదవీరులెవ్వరు లేరని నిశిత పరిశీలనవల్ల విస్పష్టమయింది. ఇందువల్ల కాశ్మీరరాజ్యం

యాపత్తు యాదవ సామ్రాజ్యంలో విలీనం కావలసినదే. దామోదర భూపతి వీరమరణంతో ఆదుకొనే వారెవ్వరు లేక అల్లకల్లోలమైన ఈరాజ్యంలో ప్రజాక్షేమందృష్ట్యా మరి యింతకన్న గత్యంతర మేమి లేదు. సర్వజ్ఞులయిన తమ సాన్నిధ్యంలో ఇంతకన్న నేనేమి విన్నవించుకోగలను ?"

ఆ విజ్ఞప్తి విని వాసుదేవు డన్నవైపవలోకించాడు. కాని బల రాముడు దానిపై స్వాభిప్రాయ మేమి వెల్లడించలేదు. శౌరి మరి కొంతసేపటివరకు మౌనం వహించి కాశ్మీర ప్రధానామాత్యుని వైపు ప్రశ్నార్థకంగా నిరీక్షించాడు.

ఆత డత్యంత వినయంతో నెన్నుదుటిపై దోసిలికట్టి నివేదిం చాడు : "శ్రీకృష్ణదేవా ! తమ ప్రధాన మంత్రివర్యులు నివేదించిన విషయంలో వ్యత్యాసమేమి లేదు. అయితే నాదొక్క మనవి. ప్రస్తు తం కాశ్మీర రాజ్యపరిపాలన కర్తలెవ్వరు లేనిమాట యథార్థమే. కాని దామోదర ప్రభువర్యుల పట్టమహిషి యశోవతీదేవి కలదుగదా! ఆమె జీవించి ఉన్నంత పర్యంతము కాశ్మీరదేశ సంప్రదాయం ప్రకారం రాజ్య పరిపాలనార్హత ఆ దేవికే సంక్రమించవలిసి ఉన్నది. అదిన్నీ గాక ఆమె గర్భవతి. ఈ వృత్తాంతం తమ ప్రధానామాత్యుల కెరుక పడి ఉండకపోవచ్చును. తా మీవిషయం రాజబాంధవులవల్ల, అంతః పురాధికారిణులవల్ల ఋజువుపరచుకోవచ్చును. ఆ దేవికి అచిర కాలంలోనే సుపుత్రు డుదయించగలడని ప్రఖ్యాత జ్యోతిర్వేత్త లనే కులు ఏకగ్రీవంగా ఆనతిస్తున్నారు. ఒకవేళ ఆ దేవికి తనూజ కలి గినా కాశ్మీరదేశ ధర్మం దృష్ట్యా రాజ్యాధికారం సర్వము ఆ తన యకే సంక్రమించవలసి ఉన్నది. తాము ధర్మాధర్మ రహస్యవేత్తలు. ఇందువల్ల ఈవ్యవహారం సర్వము సమగ్రంగా పరిశీలించి సముచిత నిర్ణయం ప్రసాదించవలిసిందని వేడుకొంటున్నాను. తాము ధర్మ సంరక్షకులన్న నిశ్చయంతోనే తమ దివ్యచిత్తాని కీవ్యవహారం నివే దించుకున్నాను."

ఆ విజ్ఞప్తి విన్నపిమ్మట యాదవ ప్రధాన సచివుని కొకింత

అలజడి కలిగింది. అయితే అత దేమాత్రము చెక్కుచెదరలేదు. యాదవుల ధర్మం ప్రకారం మహిళల కెవ్వరికీ రాజ్యపరిపాలనాధికారం లేదు. కాశ్మీరం యాదవుల హస్తగతమయింది. అందువల్ల ఆ దేశంలో వారి ధర్మమే అక్షరశః అనుసరించవలిసి ఉన్నది. కనక కాశ్మీరరాజ్ఞి గర్భవతి అయినా, ఒకవేళ ముమ్ముందు ఆమె కొక సుపుత్రు డుదయించినా ఆ రాజ్ఞికి ప్రస్తుతం మాత్రం రాజ్యపరిపాలనాధికారం సంక్రమించనేరదు. కనక ఇప్పుడు కాశ్మీర రాజ్యసింహాసనంపై యాదవాధీశ్వరుల కెవ్వరికయినా పట్టాభిషేక మహోత్సవం జరిపించవలిసినదే. ఇదే దృష్టితో తిరిగి తన వాదం సమర్థించుకున్నాడు.

శ్రీకృష్ణదేవు డంతలోనే బలరామునిపై తన జిజ్ఞాసాదృష్టి ప్రసరింపజేసి ప్రతిసమాధానంకోసం నిరీక్షించాడు. కాని ఆ గంభీర మూర్తి ముఖతః ఒక చిరునగవుమాత్రమే వెలువడింది. కాని అతని ముఖపై ఖరినిబట్టి తమ ప్రధానామాత్యుని వాదమే సమర్థిస్తున్నట్టు శౌరికి స్ఫురించింది. అందువల్ల మరి కొంతసేపటివరకు కేవలం మౌనముద్రాంకితుడై చిట్టచివరి కీవిధంగా తన నిర్ణయం వ్యక్తీకరించాడు:

"శ్రీ బలరామదేవుల సమక్షంలో నేనొక ధర్మ నిర్ణేతనని అహంకరించడం వారి ఎడల కేవలం మహాపచారమే కాగలదు. అయితే వా రెంతో వాత్సల్యదృష్టితో నన్ను మన్నించగలరన్న నమ్మికతోనే నే నీ వ్యవహారం వారికి నివేదించుకొంటున్నాను. ప్రస్తుతం ప్రధానమంత్రులు కొనసాగించిన వాదోపవాదాలనుబట్టి ఈ రాజ్య పరిపాలనాధికార నిర్ణయం బహు జటిలమయినదని భావిస్తున్నాను. అయితే ఇక్కడ వేరొక్క విషయం పర్యాలోచించవలిసి ఉన్నది.

"కాశ్మీరభూమి సాక్షాత్తు ఆ పరమేశ్వరుని అర్ధాంగి పార్వతీదేవి స్వరూపమే అని పురాతన ధర్మవేత్త లేకగ్రీవంగా ఆదేశిస్తున్నారు. ఇందువల్ల కాశ్మీర రాజ్యాధిపతి ఆ పరమశివుని అంశంవల్ల ప్రాదుర్భవించిన మహనీయుడేకాని అన్యుడు కానేరడు. అటువంటి మహీపతి ఒకవేళ పరమ దుష్టుడయినా అతని నేమాత్రము అవమా

వించరాదని. అందువల్ల తప్పక ఐశ్వర్యహాని సంభవించగలదని ఆ పురాతన ధర్మవేత్తల ఆనతి. దామోదరభూపతి అనన్యసామాన్య పరాక్రమంతో వీరశయ్య అలంకరించినందువల్ల యాదవు లాతని నత్యంత భక్తితో గౌరవించి అతని వంశాంకురానికి కాశ్మీరరాజ్యం బహూకరించవలిసి ఉన్నది. యశోవతీదేవి గర్భవతి అని నే నింతకు మును పే చారుల ముఖతః ఆలకించి వున్నాను. కాశ్మీర జ్యోతిర్వేత్తలు మహనీయులు. వారి భవిష్యద్వాణి వితథం కానేరదు. ఒకవేళ యశోవతికి యువరాజ్ఞి జన్మించినా ఆమెకే కాశ్మీర రాజ్యాధికారం సంక్రమింప జెయ్యవలిసి ఉన్నది. పురాతన ధర్మసంరక్షకులయిన యాదవుల కిదే సముచిత కర్తవ్యమని నివేదించుకుంటున్నాను."

ఆపైన శౌరి మంద్ర మధుర స్వరంతో ఆ పురాతన ధర్మవేత్తల శ్లోకం బలరామదేవుని కీవిధంగా నివేదించాడు.

"కశ్మీరాః పార్వతీ తత్ర
రాజా జ్ఞేయః శివాంశజః,
నావజ్ఞేయః స దుష్టోపి
విదుషా భూతిమిచ్ఛతా."

ఆ ప్రసంగంతోబాటు ఆ ధర్మసూక్తి విన్నంతలోనే బలరామదేవు డెంతో ఆనందించి, ఆ వ్యవహారంలో తన సంపూర్ణాంగీకృతి వెల్లడించి చక్రి నభినందించాడు. ఆవిధంగా నిర్ణయం జరిగిన పిదప యాదవ ప్రధాన మంత్రి కిక దాని కంగీకరించక తప్పలేదు. కాశ్మీర ప్రధానామాత్యుడు శ్రీకృష్ణదేవుని ఔదార్యపూర్ణమయిన ధర్మదృష్టి కానందించి, యశోవతీదేవి పరిపాలనలో కాశ్మీరం సర్వస్వతంత్రమయినా ఇప్పటినుండి యాదవుల ఎడల ప్రగాఢమైత్రితో వ్యవహరించగలనని కరవాలం చేపట్టి శపథంచేసి శ్రీకృష్ణదేవుని పాదాల ముం దది సమర్పించాడు.

ఒక శుభముహూర్తంలో యశోవతీదేవికి యాదవాధీశ్వరుల సమక్షంలో శ్రీనగర ప్రజ జయజయాభినందనల కోలాహలంలో యథావిధిగా పట్టాభిషేక మహోత్సవం జరిగింది. యాదవప్రభువు

లంతట తమతమ సైన్యాలతో రాజధాని మధురానగరికి తరలి పోయారు.

యశోవతీదేవి పరిపాలనలో కాశ్మీర ప్రజ సర్వదా కన్నతల్లి మమకారం చవిచూచింది. మరికొన్ని మాసాలలో ఆమెకొక కుమారుడుదయించి పితామహుడు గోనందుని నామధేయంతో పౌరుల కంట రికి కనువిందయినాడు.

ఆ విధంగా ఆ శిశుమూర్తి నొడిలో కూర్చుండ బెట్టుకుని అతని పేరిట మిక్కిలి జాగరూకతతో, చాకచక్యంతో కాశ్మీర రాజ్యం పరిపాలించిన యశోవతీదేవి వట్టి మానవమాత్రురాలని అనాటి ప్రజ లెవ్వరు భావించలేదు.

ఆ రాజ్ఞి సాక్షాత్తు కాశ్మీరమూర్తి పర్వతరాజ తనూజ ప్రభావ రాశి అంశంతో అవతరించిన 'కాశ్మీర దేవత' అని భావించి అను దినము ప్రగాఢ భయభక్తులతో చేతులెత్తి నమస్కరించి జయజయ ధ్వానాలతో అభినందించారు.

———